సూర్య క్యాచ్‌పై వివాదం!

బౌండరీలైన్ తాకినట్లు సఫారీ ఫ్యాన్స్ వీడియో

ఖండించిన దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ పాల్లాక్

బార్బడోస్: వెస్టిండీస్ వేదికగా ఇటీవలే ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో సూర్యకుమార్‌యాదవ్ సంచలన క్యాచ్ వివాదం అవుతూనే ఉన్నది. హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో డేవిడ్ మిల్లర్ క్యాచ్‌ను సూర్యకుమార్ కండ్లు చెదిరే రీతిలో పట్టిన క్యాచ్‌తో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. అప్పటి వరకు విజయంపై గంపెడు ఆశలు పెట్టుకున్న సఫారీలు మిల్లర్ ఔటౌతో హతాశులయ్యారు. ఫైనల్ ముగిసి ఐదు రోజులవుతున్నా.. ఇంకా ఆ షాక్ నుంచి తేరుకోలేకపోతున్నారు. ఆ జట్టు ఫ్యాన్స్ మాత్రం మ్యాచ్ ఫలితాన్నే మార్చిన సూర్య క్యాచ్‌ను వివాదాస్పదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. బెన్ కర్టిస్ అనే దక్షిణాఫ్రికా అభిమాని సూర్య క్యాచ్ వీడియోను జూమ్‌లో చూపిస్తూ..స్పష్టంగా కాలు బౌండరీలైన్‌కు తాకుతున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేసి కామెంట్ చేశాడు. 'సూర్య క్యాచ్‌ను వివిధ కోణాల్లో పరిశీలించాల్సింది. అతని కాలు బౌండరీ లైన్‌ను తాకినట్లు వీడియోలో క్లియర్‌గా కనిపిస్తున్నది' అని రాసుకొచ్చాడు. దీనికి ఓ ఇంగ్లండ్ ఫ్యాన్ కూడా వంతపాడాడు. మరోవైపు దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ షాన్ పొల్లాక్ మాత్రం వేరేలా స్పందించాడు. 'క్యాచ్‌లో ఎలాంటి లోపం లేదు. బౌండరీ లైన్ మారినా కుషన్‌కు అతని కాలు తాకలేదు. అద్భుతమైన నైపుణ్యం' అంటూ రాసుకొచ్చాడు. సూర్య సూపర్ క్యాచ్‌ను అభినందించాల్సింది పోయి లోపాలు ఎందుకు వెతకడం అంటూ ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మార్చి1న దాయాదుల పోరు!

లాహోర్: భారత్, పాక్ మధ్య మరో రసవత్తర పోరుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) రంగం సిద్ధం చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 దాకా స్వదేశంలో జరుగుబోయే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం రూపొందించిన డ్రాఫ్ట్ షెడ్యూల్‌ను ఐసీసీకి అందజేసిన పీసీబీ.. ఇందులో భాగంగా దాయాదుల పోరును మార్చి 1న నిర్ణయించింది. భారత ఆటగాళ్ల భద్రత దృష్ట్యా టీమ్‌ఇండియా ఆడే మ్యాచ్‌లన్నింటినీ లాహోర్‌లోని గడాఫీ స్టేడియం వేదికగానే జరపాలని పీసీబీ భావిస్తోంది. అయితే చాంపియన్స్ ట్రోఫీలో పాక్‌కు వెళ్లి ఆడే విషయమై బీసీసీఐ ఇంకా సమ్మతి తెలపలేదు.

బాయ్‌కాట్‌కు శస్త్రచికిత్స

లండన్: ఇంగ్లండ్ దిగ్గజ క్రికెటర్ జెఫ్రీ బాయ్‌కాట్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. తీవ్ర గొంతు క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్న 83 ఏండ్ల బాయ్‌కాట్ రెండు వారాల వ్యవధిలో శస్త్రచికిత్స చేయించుకోబోతున్నాడు. ఈ విషయాన్ని ఆయన బుధవారం వెల్లడించాడు. 'గత కొన్ని వారాలుగా వేర్వేరు స్కాన్స్‌తో పాటు బయాప్సీ చేశారు. పరీక్షల్లో గొంతు క్యాన్సర్ అని తేలింది. దీనికి చికిత్స తీసుకోబోతున్నాను' అని పేర్కొన్నాడు.

వీరులొస్తున్నారు!

- నేడు స్వదేశానికి భారత క్రికెట్ జట్టు
- ప్రధాని మోదీతో అల్పాహార విందు
- ముంబైలో విజయోత్సవ ర్యాలీ
- వాంఖడేలో ఆటగాళ్లకు సత్కారం

ఢిల్లీ: క్రికెట్‌ను మతంగా భావించే భారత్‌లో అభిమానుల దశాబ్ది కలను నెరవేర్చిన భారత క్రికెట్ జట్టు వీరులు గురువారం ఉదయం స్వదేశానికి రానున్నారు. ఇటీవలే వెస్టిండీస్ వేదికగా దక్షిణాఫ్రికాతో ముగిసిన ఫైనల్ పోరులో సఫారీలను ఓడించి 17 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత టీ20 ప్రపంచకప్ ట్రోఫీని స్వదేశానికి తీసుకొస్తున్న రోహిత్‌సేన ఉదయం 6.20 గంటలకు దేశ రాజధానిలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగిడనుంది. ప్రపంచకప్ ముగిసి ఐదు రోజులు గడిచినా భారీ తుఫాను కారణంగా బార్బడోస్‌లోనే ఆగిన టీమ్‌ఇండియా ఎట్టకేలకు బుధవారం సాయంత్రం స్థానిక గ్రాంట్లీ ఆడమ్స్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బీసీసీఐ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 'ఎయిరిండియా చాంపియన్స్ 24 వరల్డ్ కప్' అనే ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయల్దేరింది. స్వదేశానికి రాగానే భారత జట్టు ప్రధాని నరేంద్రమోదీతో ఆయన అధికారిక నివాసంలో ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బందితో మోదీ అల్పాహార విందు చేయనున్నారు.

విజయోత్సవ ర్యాలీ

మోదీతో బ్రేక్‌ఫాస్ట్ తర్వాత మధ్యాహ్నం ఢిల్లీ నుంచి నేరుగా ముంబైకి వెళ్లనున్న భారత జట్టు.. సాయంత్రం విజయోత్సవ ర్యాలీలో పాల్గొననుంది. ముంబైలోని ప్రఖ్యాత నారీమన్ పాయింట్ నుంచి వాంఖడే స్టేడియం దాకా (సుమారు రెండు కిలోమీటర్లు) ఓపెన్ బస్‌లో ప్రపంచకప్ వీరులు విక్టరీ పరేడ్‌లో పాల్గొంటారు. ఇదే విషయమై బీసీసీఐ కార్యదర్శి జై షా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ప్రపంచకప్ గెలిచిన టీమ్‌ఇండియాను గౌరవించుకునేందుకు విజయోత్సవ ర్యాలీలో భారీగా పాల్గొనండి' అని ట్వీట్ చేశాడు. 'ఈ ఆనంద క్షణాలను మేము మీ అందరితో పంచుకోవాలనుకుంటున్నాం. మెరైన్ డ్రైవ్ నుంచి మొదలుకాబోయే విక్టరీ పరేడ్‌లో కలుద్దాం' అంటూ రోహిత్ శర్మ ట్వీట్ చేశాడు. ర్యాలీ ముగిశాక బీసీసీఐ ఆధ్వర్యంలో వాంఖడేలో ఆటగాళ్లకు, కోచింగ్ సిబ్బందికి చిరు సత్కారం ఏర్పాటు చేసింది. బీసీసీఐ ప్రకటించిన రూ. 125 కోట్ల ప్రైజ్‌మనీని ఇక్కడే అందజేసే అవకాశమున్నట్టు సమచారం.

రోజంతా బిజీ షెడ్యూల్

- ఉదయం 06:20 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి రాక.
- 06:45కు ఢిల్లీలోని ఐటీసీ మౌర్య హోటల్‌కు వెళ్లి 9 గంటలకు ప్రధాని నివాసానికి బయల్దేరుతారు.
- 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా ప్రధానితో సమావేశం.
- 2 గంటలకు ముంబైకి ప్రయాణం.
- సాయంత్రం 4 గంటలకు ముంబైకి చేరుకుంటారు.
- 5 గంటలకు విజయోత్సవ ర్యాలీ ఆరంభం.
- రాత్రి 7.30 గంటలకు వాంఖడేలో బీసీసీఐ సత్కారం.

సెయిలర్లు పోటాపోటీగా..

- హైదరాబాద్ సెయిలింగ్ వీక్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హుసేన్‌సాగర్ వేదికగా 38వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్ హోరాహోరీగా సాగుతున్నది. పోటీలకు తొలి రోజైన బుధవారం దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సెయిలర్లు వేర్వేరు విభాగాల్లో పోటీపడ్డారు. పురుషుల ఐఎల్‌సీఏ-7 విభాగంలో మోహిత్‌సైనీ ఆధిక్యంలో నిలిచాడు. అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తూ అగ్రస్థానం కైవసం చేసుకున్నాడు. ఇదే విభాగంలో మహాప్రభు, సికాంశుసింగ్ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. మహిళల ఐఎల్‌సీఏ-6 విభాగంలో రితిక, ఐఎల్‌సీఏ 6 ఓపెన్ కేటగిరీలో రామ్ మిలాన్, 470 క్లాస్‌లో శ్రద్ధ వర్మ, ఆర్కేశర్మ అగ్రస్థానాలు కైవసం చేసుకున్నారు. సాగర్ జలాలపై బలంగా వీస్తున్న గాలులను అనుకూలంగా మలుచుకుంటూ సెయిలర్లు సత్తాచాటారు.

హార్దిక్ రికార్డు ర్యాంక్

- టీ20 ఆల్‌రౌండర్లలో అగ్రస్థానం

ఢిల్లీ: పొట్టి ప్రపంచకప్‌లో బంతితో పాటు బ్యాట్‌తోనూ రాణించి ఫైనల్‌లో టీమ్‌ఇండియా హీరోగా మారిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రెండింతల ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు. భారత్ వరల్డ్‌కప్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన పాండ్యా బుధవారం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన పురుషుల టీ20 ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. తద్వారా భారత్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ప్రపంచకప్‌లో 150కి పైగా స్ట్రైక్ రేట్‌తో 144 పరుగులు చేసిన హార్దిక్.. బంతితో 11 వికెట్లు పడగొట్టాడు. దీంతో అతడు ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి శ్రీలంక ఆల్‌రౌండర్ వనిందు హసరంగతో కలిసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. భారత పేస్‌గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా 12 ర్యాంకులు మెరుగుపరుచుకుని 12వ స్థానానికి చేరగా అక్షర్ పటేల్ (7), కుల్దీప్‌యాదవ్ (8) టాప్-10లో నిలిచారు. బ్యాటర్లలో సూర్యకుమార్ యాదవ్ రెండో ర్యాంక్‌లో ఉండగా ట్రావిస్ హెడ్ టాప్‌ర్యాంక్‌లో ఉన్నాడు.

'యూరో' క్వార్టర్స్ ఖరారు

స్టట్‌గార్ట్: గత రెండు వారాలుగా ఫుట్‌బాల్ అభిమానులను అలరిస్తున్న ప్రతిష్టాత్మక యూరో కప్ కీలక దశకు చేరుకుంది. 24 జట్లు 6 గ్రూపులుగా విడిపోయి తలపడ్డ ఈ టోర్నీ క్వార్టర్స్‌కు చేరింది. డిఫెండింగ్ చాంపియన్ ఇటలీ గ్రూపు దశలోనే వెనుదిరగగా టైటిల్ ఫేవరెట్లుగా ఉన్న ఆతిథ్య జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఇంగ్లండ్ క్వార్టర్స్ చేరాయి. మంగళవారం రాత్రి టర్కీ 2-1తో ఆస్ట్రియాను ఓడించి క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకుంది. శుక్రవారం నుంచి మొదలుకాబోయే క్వార్టర్స్‌లో స్పెయిన్-జర్మనీ, పోర్చుగల్-ఫ్రాన్స్, ఇంగ్లండ్-స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్-టర్కీ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

అల్కారజ్, గాఫ్ ముందంజ

- డబుల్స్‌లోనూ నాగల్‌కు నిరాశ

లండన్: ఇటీవలే ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో సత్తాచాటి టైటిల్ నెగ్గిన నయా స్పెయిన్ బుల్ కార్లోస్ అల్కారజ్ గ్రాస్‌కోర్టులోనూ జోరు కొనసాగిస్తున్నాడు. వింబుల్డన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన అల్కారజ్ బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో 7-6 (7/5), 6-2, 6-2తో అలెగ్జాండర్ వుకిక్ (ఆస్ట్రేలియా)ను వరుస సెట్లలో ఓడించి మూడో రౌండ్‌కు దూసుకెళ్లాడు. తొలి రౌండ్లో కాస్త ప్రతిఘటించిన వుకిక్ ఆ తర్వాత స్పెయిన్ కుర్రాడి జోరు ముందు నిలబడలేకపోయాడు. డేనిల్ మెద్వెదెవ్ 6-7 (3/7), 7-6(7/4), 6-4, 7-5తో ముల్లర్ (ఫ్రాన్స్)ను చిత్తుచేసి రెండో రౌండ్‌కు చేరాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో కోకో గాఫ్ 6-2, 6-1తో టొడొనిను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత ఆటగాడు సుమిత్ నాగల్.. డబుల్స్‌లోనూ నిరాశపరిచాడు. డబుల్స్ తొలి రౌండ్‌లో నాగల్-లజోవిచ్ ద్వయం 2-6, 2-4తో మార్టిన్-మునర్ జోడీ చేతిలో పరాభవం పాలైంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రోహన్ బోపన్న, మాథ్యూ ఎబ్డెన్ జోడీ 7-5, 6-4తో హాస్, అరెండ్స్ ద్వయంపై గెలిచి ముందంజ వేసింది.

శౌర్యంగ పర్వానికి సిద్ధం

ప్రస్తుతం దేశం మొత్తాన్ని 'కల్కి' మేనియా ఆవహించింది. బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో ఈ సినిమా దూసుకుపోతున్నది. లాంగ్‌రన్‌లో వెయ్యికోట్ల వసూళ్లు సాధించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 'కల్కి' అపూర్వ విజయంతో ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ఉన్న ప్రభాస్ తన తదుపరి చిత్రం 'శౌర్యంగపర్వం' కోసం సన్నద్ధమవుతున్నారని తెలిసింది. 'సలార్-ది సీజ్ ఫైర్'కు సీక్వెల్‌గా రానున్న ఈ సినిమా నిర్మాణం నుంచే అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నది. దర్శకుడు ప్రశాంత్‌నీల్ ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన కొంత భాగాన్ని షూట్ చేశారని తెలుస్తున్నది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజాసాబ్' చిత్రీకరణ చివరి దశకు చేరుకోవడంతో .. ప్రభాస్ ఇక 'శౌర్యంగపర్వం'పైనే దృష్టిపెట్టబోతున్నారని అంటున్నారు. ఆగస్ట్ రెండోవారం నుంచి ఆయన షూట్‌లో జాయిన్ కాబోతున్నారని సమాచారం.

అప్పటివరకు టెన్షనే..!

కమల్‌హాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన ప్రతిష్టాత్మక చిత్రం 'భారతీయుడు-2' ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు కమల్‌హాసన్. ఈ సందర్భంగా 'భారతీయుడు' మూడోభాగం గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారాయన. 'భారతీయుడు-2' చిత్రంలో నటించడానికి ఏకైక కారణం మూడో భాగం తాలూకు కథనే అని కమల్‌హాసన్ తెలిపారు. దర్శకుడు శంకర్ మూడో పార్ట్ కథ చెప్పినప్పుడు తాను ఓ అభిమానిగా మారిపోయానని ఆయన అన్నారు. 'ప్రేక్షకులకు రెండో భాగం కూడా బాగా నచ్చుతుందనుకుంటున్నా. నాకైతే మూడోభాగం బాగా నచ్చింది. కానీ అది రిలీజ్ కావడానికి ఇంకా ఆరు నెలల సమయం ఉంది. అప్పటి వరకు టెన్షన్‌గానే వేచి చూడాలి. మూడో భాగంలో కథానాయకుడు సేనాపతి తండ్రి పాత్ర కూడా ఉంటుంది' అని కమల్‌హాసన్ పేర్కొన్నారు. 1996లో సంచలనం సృష్టించిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా రానున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలేర్పడ్డాయి. సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రియాభవానీ శంకర్, ఎస్‌జే సూర్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు.

చిత్రం

ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్.. ఎక్సలెంట్ వైఫ్

సినీరంగంలో కొన్ని కాంబినేషన్స్ ఎప్పుడూ ప్రత్యేకమే. అలాంటి వాటిలో అగ్ర హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబో ఒకటి. వీరిద్దరి కలయిలో గతంలో ఎఫ్-2, ఎఫ్-3 వంటి హిలేరియస్ ఎంటర్‌టైనర్స్ రూపొందాయి. ఈ హిట్ కాంబినేషన్ మరోమారు ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని పంచడానికి సిద్ధమవుతున్నది. వెంకటేష్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలు. ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా, డి.సురేష్‌బాబు కెమెరా స్విఛాన్ చేశారు. హీరో, అతని ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్, అతని ఎక్సలెంట్ వైఫ్ నడుమ నడిచే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇదని చిత్ర బృందం పేర్కొంది. ఉప్రేంద లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయి కుమార్, నరేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

అమ్మాయి పాత్రలో విశ్వక్‌సేన్

యువహీరో విశ్వక్‌సేన్ సినిమా అంటే కథలో ఏదో కొత్తదనం ఉండాల్సిందే. కెరీర్ ఆరంభం నుంచి ఆయన ఎంచుకునే సబ్జెక్ట్స్ వైవిధ్యమైన ఇతివృత్తాలతో ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఆయన లేడీ క్యారెక్టర్ 'లైలా'తో ప్రేక్షకుల ముందుకురాబోతుండటం విశేషం. విశ్వక్‌సేన్ కొత్త చిత్రం 'లైలా' బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. రామ్‌నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయిక. ముహూర్తపు సన్నివేశానికి కె.రాఘవేంద్రరావు క్లాప్‌నివ్వగా, దర్శకుడు హరీష్‌శంకర్ కెమెరా స్విఛాన్ చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో విశ్వక్‌సేన్.. లైలా పాత్రలో ఛార్మింగ్‌లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. ఆయన మేకోవర్ అద్భుతంగా ఉందని, కథానుగుణంగా లేడీ గెటప్ చక్కగా కుదిరిందని అంటున్నారు. 'తన అందమైన కళ్లతో..మనోహరమైన రూపంతో ఈ లైలా అందరిని ఆశ్చర్యపరుస్తుంది' అని విశ్వక్‌సేన్ లేడీ గెటప్‌లోని ఫొటోను సోషల్‌మీడియాలో పంచుకున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రిచర్డ్‌ప్రసాద్, సంగీతం: తనిష్క్ బాగ్చి, జిబ్రాన్, రచన: వాసుదేవమూర్తి, దర్శకత్వం: రామ్ నారాయణ్.

విజయ్ సేతుపతి జోడీగా..

'స్కైలాబ్' తర్వాత తెలుగు సినిమాలకు దూరమైపోయింది మలయాళీ భామ నిత్యామీనన్. అయితే తమిళ, మలయాళ భాషల్లో మాత్రం తన అభిరుచికి తగిన కథాంశాలను ఎంచుకొని సినిమాలు చేస్తున్నది. గత కొంతకాలంగా కమర్షియల్ చిత్రాల్లో మంచి అవకాశం కోసం ఎదురుచూస్తున్నదీ అమ్మడు. ఈ నేపథ్యంలో తమిళంలో విజయ్‌సేతుపతి సరసన భారీ ప్రాజెక్ట్‌లో నాయికగా ఖరారైనట్లు తెలుస్తున్నది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల 'మహారాజ' చిత్రంతో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు విజయ్ సేతుపతి. ఈ క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్‌లో ఆయన నటనకు సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఈ నేపథ్యంలో పాండిరాజ్ దర్శకత్వంలో తన తదుపరి సినిమాకు సన్నద్ధమవుతున్నారు విజయ్ సేతుపతి. ఇందులో నిత్యామీనన్ కథానాయికగా నటించనుందని తెలుస్తున్నది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో నిత్యామీనన్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని చెబుతున్నారు. త్వరలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది.

ఇది మనందరి కథ

'స్కూల్ రోజుల్లో 35 మార్కులు నాకు పెద్ద పర్వతంలా అనిపించేవి (నవ్వుతూ). దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు నాకు పాఠశాల రోజులు గుర్తొచ్చాయి. మా అమ్మ ఈ కథ విని..ఇది మనందరి కథ..చాలా మంది జీవితం ఇలాగే ఉంటుందని చెప్పింది' అన్నారు రానా. ఆయన సమర్పకుడిగా వ్యవహరిస్తున్న చిత్రం '35 చిన్న కథ కాదు'. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటించారు. కిషోర్ ఈమాని దర్శకుడు. రానా, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మాతలు. ఆగస్ట్ 15న తెలుగు, తమిళంలో విడుదల కానుంది. తిరుపతి నేపథ్యంలో నడిచే ఈ కథలో నివేదా థామస్ తల్లి పాత్రలో కనిపించింది. చదువు అంతగా రాని తమ కుమారుడి జీవితం గురించి తపన పడే తల్లిదండ్రుల కథగా భావోద్వేగభరితంగా టీజర్ సాగింది. ఈ సందర్భంగా మాట్లాడిన రానా..ఇదొక హార్ట్‌టచింగ్ స్టోరీ అని, ఇలాంటి కథలు అరుదుగా వస్తాయన్నారు. తాను ఇప్పటివరకు పోషించిన పాత్రల్లో ది బెస్ట్ ఇదని నివేదా థామస్ చెప్పింది.

ఓ యువకుడి ప్రతీకారం

రక్షిత్ అట్లూరి హీరోగా రాధికా శరత్‌కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి వెంకట సత్య దర్శకుడు. ధ్యాన్ అట్లూరి నిర్మాత. ఆగస్ట్ 2న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ కలబోసిన చిత్రమిది. తనకు జరిగిన అన్యాయానికి ఓ యువకుడు తీర్చుకున్న ప్రతీకారం ఏమిటన్నదే చిత్ర ఇతివృత్తం. కథలోని భావోద్వేగాలు కదిలిస్తాయి. రాధికా శరత్‌కుమార్ పాత్ర కీలకంగా ఉంటుంది' అని చిత్ర బృందం పేర్కొంది. సంగీర్తన విపిన్, రాధికా శరత్‌కుమార్, చరణ్‌రాజ్, కాంచి, రాకెట్ రాఘవ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి, సంగీతం: శరవణ వాసుదేవన్, సంభాషణలు: లక్ష్మీ లోహిత్ పూజారి.

నేడు ఆస్కార్ గ్రంథాలయం ఓపెనింగ్

ఆస్కార్ అవార్డుకు గుర్తింపుగా కట్టించిన సినీ గేయ రచయిత చంద్రబోస్

చిట్యాల, జూలై3: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగకు చెందిన ప్రముఖ సినీగేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ గ్రామంలో ఆస్కార్ గ్రంథాలయాన్ని నిర్మించాడు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, చంద్రబోస్ చేతుల మీదుగా గురువారం ప్రారంభించనున్నారు. ఆస్కార్ అవార్డుకు తీపిగుర్తుగా రూ.36 లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశారు. రెండంతస్తులతో నిర్మించిన గ్రంథాలయం భవన నిర్మాణం పూర్తయి, అన్ని హంగులతో రూపుదిద్దుకుంది. పదునైన పాటలతో సినీ పరిశ్రమలో ఎంత ఎదిగినా పుట్టిన ఊరిపై మాత్రం తన మమకారాన్ని చూపిస్తూ చంద్రబోస్ అందరి మన్ననలు పొందుతున్నారు. అట్టహాసంగా నేడు ప్రారంభించే ఆస్కార్ గ్రంథాలయం చెంతకు చంద్రబోస్ మిత్రులు, శ్రేయోభిలాషులు, కళాకారులు, మిత్రులు పెద్ద ఎత్తున తరలిరావాలని చంద్రబోస్ సోదరుడు రాజేందర్ విజ్ఞప్తి చేశారు.

థ్రిల్లర్ కథతో 'రాచరికం'

అప్సరా రాణి, విజయ్‌శంకర్, వరుణ్‌సందేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాచరికం'. సురేష్ లంకపల్లి దర్శకుడు. ఈశ్వర్ నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరగుతున్నాయి. బుధవారం ఈ సినిమా నుంచి అప్సరా రాణి స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో అప్సరా రాణి అద్భుతమైన పాత్రలో కనిపిస్తుందని, సంప్రదాయ కుటుంబానికి చెందిన అమ్మాయిగా ఆమె నటన ప్రత్యేకాకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది. థ్రిల్లింగ్ అంశాలతో ఈ సినిమా ఆకట్టుకుంటుందని నిర్మాత తెలిపారు. హైపర్ ఆది, రంగస్థలం మహేష్, విజయ రామరాజు, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్యసాయి, సంగీతం: వెంగీ.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.